

# సంసారంలో సరిగమలు
## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అతి మధురం

**తలుపు తీసుకుని కాళ్ళీడుస్తూ భారంగా లోపలికి వచ్చాడు సతీష్.** సూట్‌కేస్‌లో బట్టలు సర్దుకుంటున్న మధురిమ అతని వాలకం చూసి పట్టించుకోకుండా సర్దుకోవడంలో నిమగ్నమైంది. నెమ్మదిగా ఆమె దగ్గరకి వచ్చి దుఃఖంగా అడిగాడు.

"రేపే కదా నువ్వు హైదరాబాద్ వెళ్ళేది?"

"అవును" తలపైకెత్తకుండా సమాధానం చెప్పింది మధురిమ.

"వారం రోజులు కదూ?"

"అవును"

"అంటే ఏడు రోజులు. నువ్వు లేకుండా నేను ఎలా ఉండాలి మధూ" గొంతు పూడుకుపోతూండగా అడిగాడు.

సూట్ కేస్ మూసేసి అతని వంక తిరిగి చెప్పింది విసుగ్గా.

"చూడు సత్తిబాబూ! నేను రేపు ఊరువెళ్ళి, వారం తర్వాత వస్తానని నీకు నెలరోజులముందే తెలుసు. ఈ నెల రోజులుగా రోజూ నన్ను సతాయిస్తూనే ఉన్నావు. రేపు రైలెక్కేదాకా ఇదే గోలా?"

"నీకు గోలే కానీ, నాకెంత కష్టంగా ఉందో నీకు అర్థం కావడంలేదు. ఒట్టి కర్కోటకురాలివి. నామీద ప్రేమలేదు. అందుకే హాయిగా వెళ్ళిపోతున్నావు." నిష్టూరంగా చెప్పాడు.

"ప్రేమంటే ఇలా కాల్చుకు తినడం అయితే ఆ ప్రేమే వద్దు. నన్ను ప్రశాంతంగా వెళ్ళనిస్తావా లేదా?" చిరాగ్గా అడిగింది.

ఆమె భుజం మీద తల ఆనించి డగ్గుత్తికగా చెప్పాడు సతీష్.

"అంత మాటనకు మధూ. నిన్ను కాల్చుకుతింటున్నావా? నువ్వు లేకపోతే ఎలా అని ఎంత బాధపడుతున్నానో తెలుసా?"

"నిజమే. ఇదిగో ఈ మాటలే చెప్పి పెళ్ళయ్యాక నన్ను ఎక్కడికీ పోనివ్వలేదు. మా బంధువుల పెళ్ళిళ్ళు, ఫంక్షన్స్, పండగలు.. అసలు దేనికైనా పంపించావా? శుభలేఖ వచ్చిందంటే భయం! ఫోన్ వచ్చిందంటే బాధ! పక్కనే ఉన్న బెంగుళూర్‌లో ఉండి, హైదరాబాద్

వెళ్ళి మూడేళ్ళయింది అంటే ఎవరైనా నమ్ముతారా? ఇప్పటికీ చుట్టాలందరిలో పేరొచ్చేసింది. నువ్వన్నావే, కర్కోటకురాలని, వాళ్ళూ అదే మాట అనుకుంటున్నారట. `మధుకి భర్తే లోకం. అతడ్ని వదిలి రాదు. మనల్ని మర్చిపోయింది` అని."

"దుర్మార్గులు.. నా గురించి కొంచెం కూడా ఆలోచించరు."

"చూడు సత్తిబాబూ! ఇంతకాలం నీ ఏడుపులకి లొంగి ఎక్కడికీ వెళ్ళలేదు కదా? కానీ ఈసారి మాత్రం వెళ్ళేది వెళ్ళేదే మా ఫ్రెండ్స్ అందరం కలిసి ఎన్నిరోజులైందో అమెరికా నుంచి రాధిక ఫోన్ చేసి దాని ఇండియా టూర్ వివరాలు చెప్పిన దగ్గర్నించి ఎన్ని ఫోనులు చేసి మా ఫ్రెండ్స్‌ని సమీకరించి హైదరాబాద్‌లో ఈ మీటింగ్ పెట్టుకున్నామో తెలుసా? రిజర్వేషన్ చేయించుకున్నప్పటినుంచీ నన్ను ప్రశాంతంగా ఉంచాలి? రాధిక రెండు నెలలకోసం వస్తోంది. వాళ్ళాయన పంపట్లే?"

"ఏమో! ఆయనకి ఆమె మీద ప్రేమలేదేమో?"

"ప్రేమ, బంధం అవచ్చుకానీ బందిఖానా అవకూడదు సత్తీ. పద కాఫీ ఇస్తాను" భర్తని వంటగదిలోకి లాక్కెళ్ళింది మధురిమ.

●●●

తిరణాలలో తప్పిపోయిన పిల్లాడల్లే రైల్వేస్టేషన్‌లో బిక్కమొహం వేసుకుని నుంచున్నాడు సతీష్. చివరి నిమషంలో ప్రయాణం ఆపుకుంటుందేమో అన్న ఆశతో ఆమె వంక జాలిగా చూసాడు. ఈసారి లొంగదలచుకోలేదు మధురిమ. జాగ్రత్తలు కూడా చెప్పలేదు. `ముప్పైఏళ్ళొచ్చాయ్. ఏం జాగ్రత్తగా ఉండలేడా?` అనుకుంది నిర్లక్ష్యంగా.

●●●

మూడేళ్ళ తర్వాత తల్లితండ్రులని చూసిన మధురిమ కళ్ళు చెమర్చాయి.

"నువ్వు వస్తున్నానని చెప్పగానే చెల్లాయికి ఫోన్ చేసానమ్మ రమ్మని. `అది వచ్చినప్పుడు చూద్దాంలే. బావ రానిస్తాడనేనా?` అంది. ఇప్పుడే ఫోన్ చేసి దాన్ని కూడా రమ్మంటాను." సంతోషంగా చెప్పింది తల్లి.

ఆ రోజంతా అమ్మ వెనకే తిరుగుతూ కబుర్లు చెప్తూ `పెళ్ళితో ఎంత స్వేచ్ఛని కోల్పోయాను?` అని ఆశ్చర్యపడిపోయింది. సాయంత్రానికి వచ్చిన చెల్లెలితో మూడేళ్ళ ముచ్చట్లు తెల్లవార్లూ చెప్పింది.

పొద్దున ఏడింటికి తల్లి నిద్రలేపి చెప్పింది.

"మధూ, నీకు ఫోన్. సతీష్"

విసుగ్గా రిసీవర్ అందుకుంది.

"మధూ! ఏం చేస్తున్నావ్? నిన్నంతా నేనే గుర్తొచ్చానుకదా? నాకైతే రాత్రంతా నిద్రలేదు. ఏంటమ్మా `రీచ్‌డ్ సేఫ్` అని మెసేజ్ ఇచ్చి ఊరుకున్నావు? కాల్ చేయచ్చుగా?"

రిసీవర్ పక్కన పెట్టి మళ్ళీ నిద్రలోకి జారుకుంది మధురిమ.

●●●

రాధిక ఇంట్లో కలిసిన ఆ ఎనిమిది మంది స్నేహితురాళ్ళు ఒక నిమిషం ఉద్వేగానికి లోనైనా మరుక్షణం మాటలు మొదలయ్యాయి. ఆ ఉధృతి ఆనకట్టలేకుండా కొనసాగుతూనే ఉంది. ఎన్నో కబుర్లు.. ఎన్నెన్నో జ్ఞాపకాలు. మిగిలిన క్లాస్‌మేట్స్ గురించి తెలియని విషయాలు, మారిన వారి శరీర ఆకృతి మీద జోకులు. ఉద్యోగంలో ఉన్నత స్థానంలోకి వెళ్ళిన వారికి అభినందనలు. ఆ నిమిషంలో వారికి భర్తలు, తల్లుల దగ్గర వదిలివచ్చిన పిల్లలు, అసలు లోకమే గుర్తురాలేదు.

చీకటి పడగానే డాబామీదకి వెళ్ళి వారి తొలిప్రేమలు గురించి బిడియంగ చెప్పుకున్నారు. తొమ్మిది గంటలప్పుడు తప్పదు కాబట్టి ఇళ్ళకి బయలుదేరారు.

"రేపు ఐమాక్స్ లో సినిమా చూసి, ఏదైనా రెస్టారెంట్‌లో లంచ్ చేద్దాం. తర్వాత బిర్లామందిర్ వెళ్దాం" రాధిక చెప్పింది.

అంతా మర్నాడు ఉదయం పదకొండుకి ఐమాక్స్‌లో కలుసుకోవాలని తీర్మానించారు.

ఆటోలో ఇంటికి వస్తున్న మధురిమ సెల్ ఫోన్ మోగింది. తల్లి.

"వస్తున్నానమ్మా దారిలో ఉన్నాను. ఐదు నిమిషాల్లో ఇంట్లో ఉంటాను." చెప్పింది.

"మధూ! అతనొచ్చాడే" గుసగుసగా చెప్పింది తల్లి.

"ఎవరూ?" అయోమయంగా అడిగింది.

"సతీష్"

ఒంట్లోని రక్తమంతా మొహంలోకి చేరినట్లుగా కోపంతో ఆమె మొహం ఎర్రబడింది. నిన్నటినుంచీ పెదవుల మీద దోబూచులాడుతున్న చిరునవ్వు పక్కకి తప్పుకుంది.

ఇంట్లోకి అడుగుపెట్టగానే, మామగారితో కబుర్లు చెపుతున్న సతీష్ ఆమె దగ్గరకి వచ్చి ఆనందంగా చెప్పాడు.

"మధూ! నేనొచ్చేసా! రేపు, ఎల్లుండి శని ఆదివారాలేగా? లక్కీగా ఈవినింగ్ ఫ్లయిట్‌లో టిక్కెట్ దొరికింది."

ఆమెకి దుఃఖం వచ్చింది. హేమాంబకి ఒక చేత్తో గొడుగుపడుతూ, రెండో చేతిలోని విసినకర్రతో విసిరే ధనుర్దాసు కథ గుర్తుకు వచ్చింది. తెలుగు వాచకంలో ఆ కథ చదివి తను నవ్వుకుంది. చుట్టుపక్కలవాళ్ళు నవ్వుతున్నా, ఎగతాళి చేస్తున్నా ధనుర్దాసు పట్టించుకోకుండా తన్మయత్వంతో ఆ సేవలు చేసేవాడిని మాస్టారు చెపితే ఆడపిల్లలంతా నవ్వేవాళ్ళు. ఏం పాపం చేసిందని తనకి ధనుర్దాసు దొరికాడు?

"అక్కా! బావొచ్చాడుగా. ఇక నువ్వు నాతో మాట్లాడితే భరించలేడు. నేను రేపు ప్రొద్దున్నే వెళ్ళిపోతా" వారం రోజులు ఉందామని వచ్చిన చెల్లి గుసగుసగా చెప్పింది.

ఇంట్లో నిన్నటి సహజ వాతావరణం మటుమాయమైపోయింది. ఎవరికివారు బిగుసుకుపోయి, పక్కనే పులి ఉందేమో అన్నంత అలర్ట్‌గా ఆచితూచి మాట్లాడుతున్నారు. అవేమీ పట్టించుకోని సతీష్ ఈ రెండు రోజులు తనెంత ఇబ్బంది పడ్డాడో, మజ్జిగ అని అన్నంలో పాలు ఎలా పోసుకున్నాడో, పాలు అనుకుని మజ్జిగని మైక్రోవేవ్ ఓవెన్‌లో ఎలా వేడిచేసాడో, ఎవరూ నవ్వకపోయినా తను నవ్వుతూ వివరించాడు.

ఆ రాత్రి పడకగదిలో అతన్ని నిలదీసింది మధురిమ.

"ఎందుకు వచ్చావు? నేను నా ఫ్రెండ్స్ తో గడపాలని కదా వచ్చాను? రేపు మేము సినిమా ప్రోగ్రాం వేసుకున్నాం. నువ్వేం చేస్తావ్ ఇంట్లో? పోనీ విజయవాడలో మీ అన్నయ్య ఇంటికి వెళ్తావా?"

"అదేంటి మధూ? నీ మీద ప్రేమతోనే కదా నేను రెక్కలు కట్టుకుని వాలింది? నేను కూడా సినిమాకి వస్తాను." భార్య చెయ్యినిమురుతూ చెప్పాడు సతీష్.

"ఛీ. అమ్మాయిలందరం వెళ్తున్నాం. నో భర్తలు, నో పిల్లలు. పోనీ సిటీ టూర్ టిక్కెట్ కొనుక్కుని ఎంచక్కా బస్సెక్కి ఊరంతా చూసి రాత్రికి ఇంటికి చేరరాదు? " ,ఆశగా అడిగింది.

"అబ్బా! నాకు తిరగడం అంటే విసుగు. పోనీ సినిమాహాల్లో నీకు దూరంగా కూర్చుంటాను. సరేనా? వచ్చేప్పుడు ఇద్దరం కలిసి రావచ్చు."

"లేదు. మేము తర్వాత హోటల్లో లంచ్, ఆ తర్వాత బిర్లా మందిర్‌కి వెళ్దామని ప్లాన్ చేసాం."

"నేనూ వస్తాను హోటల్లో దూరంగా కూర్చుంటాను. బిర్లా మందిర్‌లో కూడా?"

"ఇప్పుడేగా తిరగడం విసుగు అన్నావ్?"

"నీతో తిరగడం విసుగు లేదులే."

"నాకో డౌట్ సత్తిబాబూ. నీకు నామీద అనుమానం లాంటి దేమైనా ఉందా?"

"ఛీ! ఎంత మాటన్నావు మధూ. నా ప్రేమ నీకు అనుమానంలాగా అనిపిస్తోందా?"

"మరి? నాకో స్పేస్ కావాలి సత్తిబాబూ. నాకంటూ ఒక చిన్న ప్రపంచం కావాలి. నువ్వే సమస్తం, నువ్వే సర్వస్వం అనుకోలేను. పాతికేళ్ళదాకా స్వేచ్ఛగా పెరిగిన నన్ను పంజరంలో పెట్టి, ప్రేమ, ప్రేమ అంటే మాత్రం నీ ప్రేమని తిని, నీ ప్రేమని తాగి, నీ ప్రేమని శ్వాసించి నేను బతకలేను.' అతి సర్వత్ర వర్జయేత్' అన్నారు. నీ అతిప్రేమతో నాకు పిచ్చెక్కుతోంది. ప్లీజ్! నాకు కొంచెం ప్రేమ చాలు. నీ ప్రేమ ప్రవాహంలో కొట్టుకుపోయి, నా ఉనికిని కోల్పోతానేమో అని భయంగా ఉంది. ఇందాక నా ఫ్రెండ్ చెప్తే కానీ నాకు గుర్తురాలేదు - నేను బొమ్మలు గీస్తానని. మన పెళ్ళయ్యాక నేను ఒక్క బొమ్మగీయలేదు, ఒక్క కథ చదవలేదు. సినిమాకి వెళ్తే, ప్రేమ పేరుతో నువ్వు చేసే వెకిలి చేష్టలు చూసి ముందు, వెనకవాళ్ళు నన్ను ఎవరని అంచనా వేసుకుంటున్నారో అని భయపడిపోయి ఎప్పుడైపోయిందిరా భగవంతుడా అని మొక్కుకుంటుంటాను.

నువ్వు ఆఫీస్‌కి వెళ్తావన్నమాటేకానీ ప్రతీ అరగంటకీ ఓ ఫోన్ 'ఏం చేస్తున్నావ్ మధూ?' అంటూ. దానికి ఎస్.ఎం.ఎస్ కొసరు 'ఐ లవ్ యూ' అనుకుంటూ. స్నానంకి వెళ్ళాలన్నా భయమే. నీ ఫోన్ లిఫ్ట్ చేయకపోతే 'ఏమయ్యానా' అని ఇంటికి పరిగెత్తుకొస్తావ్. నువ్వు కాల్ చేసేప్పుడు ఎంగేజ్డ్ రాకూడదు. 'ఎవరితో మాట్లాడుతున్నావు?' అంటూ ఆరాలు. 'అమ్మతో' అంటే 'నాతో మాట్లాడవు కానీ' అంటూ నిష్టూరాలు. వీటికి తోడు 'ఏం మాయచేసావో మావాడ్ని కొంగున కట్టేసుకున్నావు. వాడికి మా ఊసే లేదు' అని మీ అమ్మ సాధింపులు. అవసరమా? నన్ను ప్రశాంతంగా అన్నం కూడా తిననివ్వని నీ ప్రేమ ఎందుకు సతీష్?" దుఃఖంతో ఆగిపోయింది.

కళ్ళు పెద్దవి చేసుకుని ఆమె చెప్పేదంతా విన్న సతీష్ నెమ్మదిగా అడిగాడు.

"నా వల్ల అంత బాధపడుతున్నావా మధూ?"

"నీ వల్లకాదు. నీ పిచ్చి ప్రేమ వల్ల. అది చూసేవాళ్ళకి నవ్వులాటగా ఉంటే, అనుభవించే వారికి ప్రాణాంతకంగా ఉంటుంది. ప్రతీది నీకేకావాలి' నేనే చీర కట్టుకోవాలో, జుట్టు ఏ స్టైయిల్ వేసుకోవాలో, చివరికి ఏ కంపెనీ బ్రా కొనుక్కోవాలో కూడా నువ్వే నిర్ణయిస్తావు. ఆ ఆధిపత్యానికి ప్రేమ అని పేరు పెడతావు. రామచరిత మానస్ రాసిన తులసీదాస్ తెలుసుగా? ఆయన కూడా నీలాగే - భార్య మీద పిచ్చి ప్రేమతో పుట్టింటికి వెళ్ళిన భార్య కోసం, అర్ధరాత్రి, తుఫానులో శవాన్ని ఆధారంగా చేసుకుని ఈదుకుంటూ వచ్చాడట. విసిగిపోయిన భార్య ఉపదేశంతో ఆ ప్రేమని భగవంతుడి మీదకి మళ్ళించాడట. నువ్వు అలా మారక్కర్లేదు కానీ నీ ప్రేమని, కనీసం నువ్వు ప్రేమ పేరుతో నా మీద పెట్టే వత్తిడిని తగ్గించు. నార్మల్‌గా ఉండు. ప్లీజ్. రాను రాను నిన్ను ద్వేషిస్తానేమో అని భయంగా ఉంది సత్తిబాబూ" చేతులు జోడించి నిస్సహాయంగా చెప్పింది.

చాలా సేపు దీర్ఘంగా ఆలోచించాడు సతీష్

"నిజంగా నువ్వు ఇంత బాధపడుతున్నావా? " బలహీన స్వరంతో అడిగాడు.

"అవును. సున్నితమైన విషయం. ఎవరితోనైనా చెప్పుకుంటే, వెంటనే వచ్చే రియాక్షన్, 'ఎంత అదృష్టం? అంత ప్రేమగా చూసుకునే భర్త మీద నేరాలు చెప్తావా?' అని. కానీ నీ ప్రేమ కౌగిలి నాకు ఉక్కు కౌగిలిలా ఉంది"

పక్కకి తిరిగి పడుకుంది మధురిమ. సతీష్ ఆ తర్వాత ఏం మాట్లాడలేదు. మర్నాడు అతను నిద్రలేవక ముందే తల్లితో చెప్పి బయటకి వెళ్ళిపోయింది మధురిమ. స్నేహితురాళ్ళతో సినిమా చూసి బయటకి వచ్చిన మధురిమ, ఎదురుగా నవ్వుతూ తనకోసం ఎదురు చూస్తున్న సతీష్‌ని చూసి నిర్ఘాంతపోయింది.

'సినిమాల్లో లాగా కొన్ని డైలాగ్స్‌కి, కొంత ఉపన్యాసానికి ఎవరూ మారిపోరు' అనుకుంది నిర్లిప్తంగా

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments on this story